www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 9 డిసెంబర్ 2023



11న వికాస కార్యాలయంలో జాబ్ మేళా

ప్రజాశక్తి-కాకినాడ

వికాస కార్యాలయంలో ఈ నెల 11న జాబ్‌మేళా నిర్వహిస్తునట్టు వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.లచ్చారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో టెక్ మహీంద్రా కంపెనీ, ఫ్లూయిన్లు, జియోఫైబర్ నెట్, సంతోషిమాత ప్యాకింగ్‌లో, ముత్తూట్ ఫైనాన్స్, డెక్కన్ కెమికల్స్, డిక్సాన్, ఇసుజు కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమో, డిగ్రీ, బి.టెక్, పీజీ ఉత్తీర్ణులైన 35 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలోని వికాస కార్యాలయం వద్ద ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్స్ జెరాక్స్‌తో హాజరవ్వాలన్నారు. మరిన్ని వివరాలకు 7799376333 నెంబరులో సంప్రదించాలన్నారు.

ఎవరిని కదిపినా కన్నీళ్లే

- రోజుల తరబడి పొలాల్లోనే నీరు
- అన్నదాతలకు కోలుకోలేని నష్టం
- తడిసిన ధాన్యం కొనని ప్రభుత్వం



కాకినాడ రోడ్డు మార్గంలో ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

పిఠాపురం మండలం చిత్రాడ గ్రామానికి చెందిన సూరంపూడి పేరయ్య ఈ ఏడాది రూ.1.20 లక్షలు పెట్టుబడి పెట్టి మూడెకరాల్లో కౌలుకు సాగు చేశాడు. తుపానుకి రెండు రోజులు ముందే యంత్రం ద్వారా కోయగా ఈలోగా ఎడతెరిపి లేని వాన ముంచెత్తింది. ధాన్యం రాశి చుట్టూ నీరు చేరి 40 శాతానికి పైగా నష్టం వాటిల్లింది. ప్రస్తుతం తడిసి ముద్దయిన ధాన్యాన్ని జాతీయ రహదారి వెంబడి ఆరబెడుతున్నా కొనేవారు ఎవరూ రావడం లేదు. తడిసిన ధాన్యాన్ని సైతం వెనువెంటనే కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా అందుకు తగ్గట్టుగా యంత్రాంగం సిద్ధంగా లేదు. ఆర్‌బికె సిబ్బందిని అడుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదంటూ పలువురు రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్కారు చెబుతోంది ఒకటి, క్షేత్రస్థాయిలో జరుగుతున్నది మరొకటి అంటూ ఎవరిని కదిపినా ప్రభుత్వ తీరుపై ధ్వజమెత్తుతున్నారు.

జిల్లాలో 2.6 లక్షల ఎకరాల్లో ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి వేయగా ఇప్పటి వరకు 1.32 లక్షల ఎకరాల్లో కోతలు పూర్తి చేసిన రైతులు పంట ఒబ్బిడి చేసుకున్నారు. మిగిలిన 50 శాతం పంటపై తుపాను ప్రభావం చూపింది. అన్నదాతలకు తీరని నష్టాన్ని మిగిల్చింది. కాకినాడ జిల్లాలో ఎక్కువ శాతం మంది రైతులు అతలాకుతలమయ్యారు. రోజులు గడిచే కొద్దీ నష్టం తీవ్రత పెరుగుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీరం దాటి మూడు రోజులైనా పొలాల నుంచి వర్షం నీరు మాత్రం అలానే ఉంది. వాగులు ఉప్పొంగి పొలాలను ముంచెత్తడం, ఆధునీకరణ లేక కాలువలు అధ్వానంగా మారడంతో నష్టం మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో గత రెండు రోజులుగా రైతులు నిలిచిపోయిన నీటిని బయటకు తీసేందుకు నానా తంటాలు పడుతున్నారు. కొన్నిచోట్ల ఇప్పుడిప్పుడే నెమ్మదిగా నీరు బయటకు వస్తుంది.ఆదివారం నాటికి కొన్ని ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో నీరు బయటకు వెళ్లే పరిస్థితి నెలకొంది. ఈ నెల 11 నుంచి ప్రభుత్వం పంట నష్టపరిహారాన్ని లెక్కిస్తామని చెబుతోంది.

కోలుకోలేని దెబ్బ

తుపాను కారణంగా జిల్లాలో 30,462 ఎకరాలు ముంపునకు గురైంది. 567 ఎకరాల్లో మినుములు, 2,175 ఎకరాల్లో పత్తి, 100 ఎకరాల్లో మొక్కజొన్న ముంపునకు గురై నష్టం జరిగింది. 23,322 ఎకరాల్లో వరి నేలను తాకింది. 75 ఎకరాల్లో మినుములు, 125 ఎకరాల్లో పత్తి, 40 ఎకరాల్లో మొక్కజొన్న నేలను తాకి నష్టం వాటిల్లింది. 26 వేల ఎకరాల్లో వరి నేటికీ నీటిలోనే ఉంది.665 ఎకరాల్లో మినుములు, 2 వేల ఎకరాల్లో పత్తి, 100 ఎకరాల్లో మొక్కజొన్న నేటికీ ఇంకా ముంపులోనే ఉంది. అతికొద్ది రోజుల్లోనే పంట చేతుకొస్తుందనుకున్న తరుణంలో తుఫాను రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. ఇప్పటివరకు కూడా రాశుల చుట్టూ చేరిన నీరు ఇంకా బయటకు రాకపోవడంతో ధాన్యం మొలకలు వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజులుగా పంటలు వరద నీటిలో మునిగి ఉండటంతో కుళ్లిపోయాయి. ముంపునకు గురైన పంటలు నీరు వెళ్లిపోయిన తర్వాత తొలగించడానికి రైతులు అదనపు సొమ్ములు వెచ్చించాల్సి వస్తుంది. రోడ్లపై పోసి ఆరబెట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా తడిచిన ధాన్యాన్ని కూడా కొంటామని చెప్పినప్పటికీ ఆర్‌బికెల పరిధిలో సిబ్బంది ఎవరు ముందుకు రావడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్నిచోట్ల కొనుగోలు చేస్తున్నప్పటికీ అనేక ప్రాంతాల్లో నేటికీ ధాన్యాన్ని కొనేవారు లేకుండా పోయారు.

ధాన్యం తడిసి ముద్దయ్యింది



ఐదెకరాలు కౌలుకు తీసుకుని సాగు చేశాను. ఎకరానికి రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడి పెట్టాను. 40 శాతం ధాన్యం పూర్తిగా తడిసి ముద్దయింది. కాకినాడ వెళ్లే జాతీయ రహదారిపై ఆరబెడుతున్నాను. తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చెప్పినా ఎవరూ రావడం లేదు. తేమ శాతాన్ని తగ్గిస్తేనే కొనుగోలు చేస్తామని అధికారులు చెబుతున్నారు.

-సూరంపూడి సత్యనారాయణ, పండ్రవాడ, సామర్లకోట మండలం.

ఇంటర్న్‌షిప్‌నకు విద్యార్థులను కేటాయించాలి


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

ప్రజాశక్తి-కాకినాడ

డిగ్రీ, ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ విద్యార్థులను ఆరు నెలల ఇంటర్న్‌షిప్ పూర్తి చేసేందుకు సంబంధిత ప్రభుత్వ శాఖలకు, ప్రైవేట్ సంస్థలకు కేటాయించాలని కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని కోర్టు హాల్లో స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమంపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జెఎన్‌టియు, నన్నయ యూనివర్సిటీ పరిధిలో ఉన్న కళాశాలలో డిగ్రీ, ఇంజనీరింగ్ చదువుతున్న ఫైనల్ ఇయర్ విద్యార్థులకు జనవరి 2024 నుంచి జూన్ 2024 వరకు ఆరు మాసాలు శిక్షణ పూర్తి చేసేందుకు వారి విద్యకు సంబంధించిన ప్రభుత్వ శాఖలకు, ప్రైవేట్ సంస్థలకు విద్యార్థులను కేటాయించాలని కలెక్టర్ ఆదేశించారు. ఏయే కళాశాల విద్యార్థిని ఏ శాఖకు, ఏ సంస్థకు కేటాయించారో వాటి వివరాలను పూర్తి స్థాయిలో అందజేయాలని కలెక్టర్ సూచించారు. జెఎన్‌టియుకెకు అనుబంధంగా ఉన్న కళాశాలలో 6,338 మంది విద్యార్థులు, నన్నయ యూనివర్సిటీ పరిధిలో 9,054 మంది విద్యార్థులు మెత్తం 15,392 మంది విద్యార్థులు ఇంటర్న్‌షిప్ విజయవంతంగా పూర్తి చేసేందుకు 50 శాతం మంది ప్రభుత్వ సంస్థల లోనూ, 50 శాతం ప్రైవేట్ సంస్థల్లోనూ వారికి కేటాయించి సక్రమంగా పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. దీనిపై అధికారులు పర్యవేక్షించాలని చెప్పారు. ఈ సమావేశంలో వికాస పీడీ కె.లచ్చారావ్, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి, జెడ్‌పి సిఇఒ వెంకటరమణారెడ్డి, డిఎం అండ్ హెచ్ఒ నరసింహ నాయక్, వ్యవసాయ శాఖ జెడి విజయ్ కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ జెడి రమణమూర్తి, పసు సంవర్ధక శాఖ జెడి సూర్యప్రకాశరావు, సిపిఒ త్రినాథ్, ఐసిడిఎస్ పీడీ ప్రవీణ, వివిధ శాఖల అధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థులు పాల్గొనాలి



బహుమతులను అందజేస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-కాకినాడ

జ్ఞాన విస్తృతితో పాటు, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే క్విజ్ పోటీల్లో విద్యార్థులందరూ ఉత్సాహంగా పాల్గొవాలని కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా కోరారు. ధీరూభాయి అంబానీ జయంతిని పురస్కరించి రిలయన్స్ ఇండస్ట్రీస్ సంస్థ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం స్థానిక అంబేద్కర్ భవన్ ఆడిటోరియంలో పాఠశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో 9, 10 తరగతులు చదువుతున్న సుమారు 600 మంది విద్యార్థినీ విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్విజ్, వక్తత్వం, డ్రాయింగ్ వంటి పోటీలలో పాల్గొనడం విద్యార్థులలో మేధో వికాసానికి దోహదం చేయడంతోపాటు, భావి జీవితంలో చైతన్యంతో ముందుకు సాగేందుకు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుదని తెలిపారు. ఇటువంటి పోటీల్లో జిల్లాలోని విద్యార్థులు అందరూ తప్పనిసరిగా పాల్గొవాలని ఆమె కోరారు. సామాజిక సేవా దక్పథంతో ఈ పోటీలు నిర్వహించిన రిలయన్స్ ఇండస్ట్రీస్ సంస్థను, పోటీలలో పాల్గనేలా ప్రోత్సహించిన ఉపాధ్యాయులను కలెక్టర్ అభినందించారు.

పంచాయితీరాజ్ చట్టాలపై అవగాహన



తాళ్లరేవులో అవగాహన కల్పిస్తున్న భైరవమూర్తి

ప్రజాశక్తి - పెద్దాపురం, తాళ్లరేవు

పంచాయితీలు, సచివాలయాల సిబ్బంది పంచాయితీరాజ్ చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకున్నప్పుడే గ్రామాల అభివృద్ధి, ప్రజలకు న్యాయం సాధ్యమవుతుందని పెద్దాపురం ఎంపిడిఒ బి.అశోక్ కుమార్ అన్నారు. స్థానిక మండల కార్యాలయంలో పంచాయతీల సిబ్బంది, కార్యదర్శులు, సచివాలయాల కార్యదర్శిలకు పంచాయతీరాజ్ చట్టాలపై శుక్రవారం ఒకరోజు నిర్వహించిన శిక్షణా తరగతిలో ఆయన మాట్లాడారు. పంచాయతీరాజ్ చట్టాలకు అనుగుణంగా పాలకవర్గ సమావేశాల నిర్వహణ, ప్రజా సమస్యల గుర్తింపు, పరిష్కారం, ఆదాయ వనరుల పెంపుదల, ప్రజా పరిపాలనకు సంబంధించి అవగాహన పెంచుకోవాలన్నారు. ఇఒపిఆర్‌డి కె.రాజశేఖర్, నక్కా మూర్తి, జ్యోతుల పద్మరాజు, ఈశ్వరరావు, వి.శ్రీనివాస్, భార్గవ్, భారతి, కళ, శ్రీదేవి, సుభాని, బషీర్, రమణ పాల్గొన్నారు. తాళ్లరేవు మండల కార్యాలయంలో ఎంపిపి రాయుడు సునీత గంగాధర్ అధ్యక్షతన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి సునీత గంగాధర్ మాట్లాడారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సచివాలయ కార్యదర్శులు, అనుభవం లేని పంచాయతీ కార్యదర్శులు ఈ శిక్షణ ద్వారా అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఏ అధికారి తప్పు చేసినా బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. ప్రతి అంశంపై పంచాయతీ కార్యదర్శులు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఇఒపిఆర్‌డి మల్లాడి భైరవమూర్తి, శిక్షణ అధికారి సుధారాణి పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. గ్రామపంచాయతీ స్వరూప స్వభావాలు, పంచాయతీ సమావేశాల నిర్వహణ, ఆదాయ మార్గాలు, పంచాయతీ రికార్డులు పొందుపరచడం వివరించారు.

సైనిక సంక్షేమ నిధికి విరాళాల ఇవ్వాలి

ప్రజాశక్తి-కాకినాడ

వీర సైనికులు, వారి కుటుంబాల సంక్షేమ నిధికి ప్రజలు, వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక సంస్థలు విరివిగా విరాళాలు అందించాలని జిల్లా కలెక్టర్ కోరారు. 2022 సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రూ.46,83,533 విరాళాలు సేకరించి రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచింది. దీనిపై గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ గురువారం రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన 2023 సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాకు ట్రోఫీని అందజేశారు. గవర్నర్ అందించిన ట్రోఫీని జిల్లా సైనిక్ సంక్షేమ బోర్డు చైర్‌పర్సన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా తరపున జిల్లా సైనిక సంక్షేమ అధికారి కెప్టెన్ పి.సత్యప్రసాద్ స్వీకరించారు. శుక్రవారం ఆయన జిల్లా కలెక్టర్‌ను ఆమె ఛాంబర్‌లో కలిసి ఈ ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ రక్షణలో ఎన్నో కష్టాలకు ఎదురొడ్డి, ధైర్య సాహసాలతో వీరోచిత సేవలను అందిస్తున్న సైనికులు, వారి కుటుంబాల సంక్షేమం కోసం కృతజ్ఞతా భావనతో భూరి విరాళాలు అందించిన ప్రజలకు, సంస్థలకు కతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో ఈ సంవత్సరం కూడా విరివిగా విరాళాలు అందించి కాకినాడ జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని ఆమె ప్రజలు, సంస్థలను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు, సైనిక సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత రైతులను తక్షణం ఆదుకోవాలి

తుపాను వల్ల నష్టపోయిన రైతులను తక్షణం ఆదుకోవాలని పలు పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. దెబ్బతిన్న పంటలను శుక్రవారం వారు పరిశీలించారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

తాళ్లరేవు తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని తేమశాతం పెంచి రైతుకి నష్టం లేకుండా మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాబాబు డిమాండ్ చేశారు. ఇప్పటివరకు కోయలేని పంట పొలాలకు పంట నష్టం అంచనా వేయాలని, ఎకరానికి రూ.30 వేల పరిహారం ఇవ్వాలన్నారు. ఇంజరం, ఉప్పంగల, సుంకరపాలెం గ్రామాల్లో ఆయన పంట చేలను పరిశీలించారు. ఈ మూడు పంచాయతీల పరిధిలో మురుగు కాలువలు బాగు చేయక మురుగునీరు దిగడం లేదన్నారు. పడిపోయిన వరి పొలాలు మొలక వస్తున్న కారణంగా వెంటనే పంట నష్టం అంచనా వేయాలన్నారు. సంచితో 76 కేజీలు తూయాల్సి ఉండగా 76 కేజీల 500 గ్రాములు తూకం వేస్తున్నారని అయినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. దీనివల్ల రైతులకు నష్టం జరుగుతోందన్నారు. తాళ్లరేవులో ఒక కౌలు రైతు 150 బస్తాలు మిల్లుకు పంపిస్తే 27 పాయింట్లు వస్తే 9 కేజీలు తగ్గించవలసి ఉండగా 13 కేజీలు తగ్గిస్తామని మిల్లర్లు అంటున్నారని చెప్పారు. ఆయన వెంట చీకట్ల సత్యనారాయణ, గురజాపు వెంకటరమణ, గణేష్ ఉన్నారు.

ప్రతి ఎకరాకరూ రూ.25 వేలు నష్టపరిహారం ఇవ్వాలని జనసేన పార్టీ పిఎసి సభ్యుడు పితాని బాలకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం చొల్లంగి, చొల్లంగిపేట, జి.వేమవరంలో ఆయన పంట పొలాలను పరిశీలించారు. రైతులకు పంటల బీమా వర్తించేలా చేయాలని, 75 కేజీల బస్తా ధాన్యం రూ.1637,లు సాధారణ రకం, ఎ గ్రేడ్ రూ.1652కు కొనుగోలు చెయ్యాలని కోరారు. మురుగు కాలువలకు పూడికలు వెంటనే తీయించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట అత్తిలి బాబూరావు, జి.వేమవరం సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు, వెలుగుబంట్ల సూరిబాబు, దూడల స్వామి, పెన్నాడ శివ, అంకన ఆంజనేయులు, కనకాల పెదబాబు, సుందరపల్లి సత్యనారాయణ, నరాల రామకృష్ణ, కందుల సత్తిబాబు, వైటిఆర్ తదితరులు పాల్గొన్నారు. **రౌతులపూడి** మండలంలోని ఎం.చామవారం గ్రామ శివారులో ఉన్న గుర్రపు చెరువు గండి కొట్టడంతో దెబ్బ తిన్న పంటలను ఎంఎల్‌ఎ పర్వత పూర్ణచంద్రప్రసాద్ పరిశీలించారు. పంట నష్టంపై రైతులను ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సత్యవేణి మురళి, స్థానికులు ఉన్నారు. **సామర్లకోట రూరల్** పంట మొలకలు వచ్చి ధాన్యం ఎందుకు పనికిరాకుండా మారిపోయిందని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని భీమవరం గ్రామానికి చెందిన రైతులు కోరారు. వాతావరణం తెరపి ఇవ్వడంతో రైతులు బరకాల క్రింద భద్రపరిచిన ధాన్యం రాశులను విప్పి చూసుకుని మొలకలు రావడంతో ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన రైతు తృలికి పెదకాపు తన అయిదెకరాల పంట పూర్తిగా పాడైందన్నారు. సమీప రైతులు సుమారు 500కు పైగా ఎకరాల ధాన్యం వర్షం దాటికి రాశుల అడుగున మొలకలెత్తాయి. తమను ప్రభుత్వ ఆదుకోవాలని కోరారు.


పొలాలను పరిశీలించిన సిపిఎం నాయకులు


కాకినాడ రూరల్‌లో పొలాలను పరిశీలిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

తుపాను వల్ల నష్టపోయిన రైతులను, ముఖ్యంగా కౌలు రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా తక్షణం ఆదుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది. చీడిగ, తూరంగి బైపాస్ రోడ్డులోని దెబ్బ తిన్న పంట పొలాలను పార్టీ బృందం శుక్రవారం పరిశీలించింది. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ పంట నష్ట పరిహారం ఎకరాకు రూ.35 వేలు ఇవ్వాలని, తేమ శాతం నిబంధనల పట్ల రైతులకు అవగాహన, భరోసా కల్పించాలని. ముంపు సమస్యలకు కారణమవుతున్న ఆక్రమణలు తొలగించాలని పార్టీ డిమాండ్ చేసింది. తుపాను వల్ల పంట నష్టపోయిన ప్రతి ఎకరాకూ రూ.35 వేలు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసింది. నూటికి 90 శాతం పైబడి కౌలు రైతులే వ్యవసాయం చేస్తున్నారని, వడ్డీ వ్యాపారులు, ఎరువుల కొట్ల వ్యాపారుల వద్ద అప్పులు చేసి ఒక్కో ఎకరాకూ రూ.35 వేలు పెట్టుబడి పెట్టారన్నారు. బైపాస్ రోడ్డు, కొవ్వూరు రోడ్డు, మేడలైన్ ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ ఆక్రమణల వల్ల పంట కాలువలు, డ్రైనేజీలు మూసుకుపోవడం వల్ల నీరు దిగడం లేదని, పనలపై ఉన్న పంట కుళ్లిపోయేలా ఉందని సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ తెలిపారు. 9 ఎకరాల్లో పంట సాగుచేసిన కౌలు రైతు రూ.3 లక్షలు పెట్టుబడి అప్పులు చేసి పెట్టారని, మరో రైతు 6 ఎకరాలు సాగుకు రూ.2 లక్షలు పెట్టుబడి పెట్టారని తెలిపారు. జిల్లాలో ఎక్కడ చూసినా పంట బయటకు తేవడానికి వీలు లేకుండా చుట్టూ నీటి ముంపు ఉందని క్షేత్ర స్థాయిలో అధికారులు పరిశీలన చేసి వేసవి కాలంలోనయినా తగిన పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. పంట పొలాలను పరిశీలించిన పార్టీ బృందంలో కె.శ్రీనివాస్, పి.రామకష్ణ, టి.రాజా, ఎంవి.రమణ, వి.చంద్రరావు ఉన్నారు.

కార్టూ'నిజం'



బాధితులకు సిఎం సహాయ నిధి బాసట


సహాయ నిధి చెక్కు అందజేస్తున్న దొరబాబు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

ఆరోగ్యంగా బాగోలేక అవస్థలు పడుతున్న బాధిత కుటుబాలకు సిఎం సహాయ నిధి అండగా నిలుస్తుందని రాష్ట్ర హౌసింగ్ కార్పోరేషన్ చైర్మన్, వైసిపి పెద్దాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దవులూరి దొరబాబు పేర్కొన్నారు. సారా సీతామహాలక్ష్మి కుటుంబానికి సిఎం సహాయం నిధి నుంచి రూ.2.75 లక్షల చెక్కును శుక్రవారం సామర్లకోట పార్టీ కార్యాలయంలో దవులూరి దొరబాబు అందజేశారు. ఈ సందర్భంగా సీతామహాలక్ష్మి మాట్లాడుతూ తన కుమారుడు ఊపిరితిత్తులు, గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న నేపథ్యంలో వైద్యులను సంప్రదిస్తే రూ.లక్షల్లో ఖర్చు అవుతుందని చెప్పారన్నారు. తన ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగానే ఉండటంతో వైద్యం కోసం దొరబాబు ద్వారా సిఎం జగన్ మోహన్ రెడ్డిని కలిశామన్నారు. దీంతో తన గోడు ఆలకించిన సిఎం జగన్ మోహన్ రెడ్డి రూ.2.75 లక్షల ఆర్థిక సహాయం అందించారని తెలిపారు. తనకు సహాయం అందించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సామర్లకోట సొసైటీ అధ్యక్షుడు మేకా శ్రీనివాసరావు, వైసిపి నాయకులు రెడ్నం దొరబాబు, ఇంజుమళ్ల అచ్చారావు పాల్గొన్నారు.


వికలాంగ బాలల ఆటల పోటీలు

వికలాంగ బాలలకు ఆటలు పోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక మహాత్మా గాంధీ మున్సిపల్ పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో బాలలకు ఆటల పోటీలు నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం ఎంఎల్.శివజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో భాగంగా బాలలకు క్యారమ్స్, సింగింగ్, రన్నింగ్, డ్రాయింగ్, పెయింటింగ్, చైర్ గేమ్స్ నిర్వహించారు. ఈ పోటీల్లో మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వికలాంగ బాలలు అధిక సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల అనంతరం హెచ్ఎం శివ జ్యోతి మాట్లాడుతూ త్వరలో జరిగే వికలాంగుల దినోత్సవ సభలో విజేతలకు బహుమతులు అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో భవిత సిబ్బంది బి దుర్గా ప్రసాద్ రెడ్డి,బి ఆనందరావు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం జగన్‌తోనే సాధ్యం


సభలో మాట్లాడుతున్న హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు

ప్రజాశక్తి - పెద్దాపురం

రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితోనే సాధ్యమవుతుందని హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. శుక్రవారం రాయభూపాలపట్నంలో నిర్వహించిన వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ చీకట్ల లక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ సభా కార్యక్రమానికి ముందు పార్టీ జెండాను, అభివృద్ధి బోర్డును ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గవరసాన సూరిబాబు, ఎంపిపి పెంకే సత్యవతి, గృహసారథుల మండల కన్వీనర్ గోపు మురళి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీరరాఘవరావు, సొసైటీ అధ్యక్షుడు నల్లల నాగేంద్రబాబు, ముత్యాల రాజబ్బాయి, పుట్టా వెంకట్రావు, పరిమి శ్రీను, పెంకే రాంబాబు, నల్లల గోవిందు, లక్కాకుల కృష్ణ, సుందర్ రెడ్డి రాజు, పంచాయితీ, సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - కిర్లంపూడి

బూరుగుపూడి నుంచి రామవరం జాతీయ రహదారి పక్కన గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. స్థానికులు కిర్లంపూడి పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ పి.ఉమామహేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - కొత్తపేట

మంలంలోని కమ్మిరెడ్డిపాలెం మలుపు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడ్డాడు. కొత్తపేట ఎస్ఐ డి.జ్వాలసాగర్ తెలిపిన వివరాల మేరకు అంబాజీపేట మండలం చిరుతపూడికి చెందిన ఉంగ్రాజావరపు శేఖర్ రావులపాలెంలో జెసిబి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఎప్పటిలానే శుక్రవారం పని పూర్తిచేసుకుని ఇంటికి తన బైకుపై బయలుదేరాడు. కమ్మిరెడ్డిపాలెం మలుపు వద్దకు వచ్చేసరికి ప్రయివేటు ట్రావెల్స్ బస్సు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో శేఖర్ తీవ్రంగా గాయపడ్డాడు. అతని వెంటనే 108లో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం తీసుకెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఉత్తమ పురస్కారానికి మంగారాణి ఎంపిక

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

స్థానిక శ్రీ నాగరాజా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయినిగా పనిచేస్తున్న మోటూరి మంగారాణి సామాజిక మాధ్యమ ఉత్తమ ప్రభావశాలి పురస్కారానికి ఎంపిక య్యారు. తెలంగాణా రాష్ట్రానికి చెందిన ఎండ్ నౌ డిజిటల్ మీడియా సంస్థ హైద్రాబాద్, టి.హబ్‌లో డిసెంబర్ 17న నిర్వహించే కార్యక్రమంలో మంగారాణికి ఈ పురస్కారం అందుకోనున్నారు. "మంగారాణి లెస్సన్స్' పేరుతో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు వీడియో పాఠాలు బోధిస్తూ ఏడు కోట్ల 55 లక్షలకు పైగా వ్యూయర్షిప్ సాధించిన సంగతి విదితమే.

ద్వాక్రా మహిళలకు ఆటో రిక్షా అందజేత

ప్రజాశక్తి - బిక్కవోలు

ఉన్నతి మహిళా శక్తి పథకం ద్వారా ఎస్సి, ఎస్టీ డ్వాక్రా మహిళలకు ఎంఎల్ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి శుక్రవారం ఆటో రిక్షా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ వైఎస్ఆర్ కెపి ద్వారా మంజూరు కాబడిన ఆటో రిక్షాను బిక్కవోలు గ్రామానికి చెందిన శ్రీ మహాలక్ష్మి మహిళా శక్తి సంఘం సభ్యురాలు బొండపల్లి లక్ష్మీ కి ఆటో రిక్షా ను పంపిణీ చేయడం జరిగిందన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పలు కోర్టుల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రపురం, రాజోలు, ప్రత్తిపాడు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగల కోర్టుల్లో లోక్ అదాలత్‌లు నిర్వహిస్తున్నారని, కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్ తగాదాలు, యాక్సిడెంట్ కేసులు, బ్యాంకు కేసులు, రాజీపడదగిన క్రిమినల్ కేసులు, ప్రీ-లిటిగేషన్ కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరించనున్నట్లు తెలిపారు.

పశువులకు గొంతువాపు టీకాలు

ప్రజాశక్తి - చాగల్లు

తుపాను వల్ల పశువులకు వ్యాపించిన గొంతువాపు వ్యాధికి టీకాలు వేసే కార్యక్రమాన్ని స్థానిక పశువైద్యశాల వద్ద సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, వైస్ ఎంపిపి జజ్జవరపు రామచంద్రరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కొవ్వూరు డివిజన్ పశు సంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ జి.రాధాకృష్ణ పాల్గొని పశుసంవర్ధక శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలను పాడి రైతులకు వివరించారు. ఈ శిబిరంలో పాడి రైతులకు ఖనిజ లవణ మిశ్రమాలను, లివర్ టానిక్‌లను పంపిణీ చేశారు. 15 ఆవులు, 58 గేదెలకు పలు వ్యాధులకు సంబంధించి చికిత్సలు, గర్భకోశ వ్యాధులకు సంబంధించి టీకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యు.ముఖేష్, డాక్టర్ ఎస్.సుజిత, వెటర్నరీ అసిస్టెంట్ కె.రాజశేఖర్ వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు ఎస్.అర్జునరావు, స్థానికుల సిహెచ్.దుర్గామల్లేశ్వరరావు, విజయలక్ష్మి, కరిష్మా పాల్గొన్నారు.



నీటిలో మునిగిపోయిన పంటను చూపుతున్న సత్యేంద్ర

రైతుల కష్టాలు ప్రభుత్వ వైఫల్యమే

ప్రజాశక్తి - తాళ్లపూడి

తుపాను నేపథ్యం లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలోనూ, రైతులను అప్రమత్తం చేయడంలోనూ ప్రభు త్వ వైఫల్యం వల్లనే నేడు రైతులు కష్టాల పాలయ్యారని టిడిపి యువజన నాయకులు కాకర్ల సత్యేంద్ర, టిడిపి మండల రైతు సంఘం అధ్యక్షులు అన్నమరెడ్డి సత్తిబాబు ధ్వజమెత్తారు. మండ లంలో పలు ప్రాంతాల్లో తుపాను ప్రభావంతో పంటలు నాశనం అయిన నేపథ్యంలో యువగళం ఆధ్వర్యంలో బృందాలుగా వివిధ ప్రాంతాల్లో వారు పర్యటించారు. పంట నష్టపోయిన రైతులను కలుసుకుని వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని, తేమ శాతంతో సంబంధం లేకుండా ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తేమను బట్టి తరుగు అడుగుతున్నారని, ఇది ఎవరి లోపమో అర్థం కావడం లేదన్నారు. పంట నష్టానికి ఎకరాకు రూ.30 వేలు చొప్పున రైతులకు నష్ట పరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అధికారులకు అందజేశారు. కాకర్ల సత్యనారాయణ కూచిపూడి గణేష్, అనపర్తి ప్రసాద్, చెన్న సత్యనారాయణ పాల్గొన్నారు.



క్రీడా కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపిడిఒ

'ఆడుదాం ఆంధ్ర'కు కిట్లు పంపిణీ

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో క్రీడా సామాగ్రిని అందజేశారు. మండలంలో ఉన్న 24 సచివాలయాలకు వైస్ ఎంపిపి చెట్టుబత్తిన సురేష్ కుమార్, ఎంపిడిఒ వెంకటనారాయణ సచివాలయ సిబ్బందికి అందజేశారు. గ్రామస్థాయిలో యువతీ యువకులను క్రీడల పట్ల ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆడదాం ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి భాస్కర్, కటారి చంటిబాబు గ్రామ కార్యదర్శి పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న వైస్ చైర్మన్ సాయిప్రసాద్

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక 9, 29 వార్డుల్లో అభివృద్ధి పనులకు శుక్రవారం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ శంకుస్థాపన చేశారు. 9వ వార్డు పరిధిలోని పద్మనాభ కాలనీలో రూ.5 లక్షల వ్యయంతో సిమెంట్ డ్రైన్ల నిర్మాణానికి, రాజీవ్ కాలనీలో రూ.5 లక్షల వ్యయంతో సిమెంటు డ్రైన్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ కృష్ణ జీవ ప్రసాద్, మున్సిపల్ కౌన్సిలర్లు పెంటకోట సత్తిబాబు, యండమూరి విజయలక్ష్మి, చిదరాసరి రాజా, తులసి సత్య భాస్కరరావు, కొట్టి కిషోర్ పవన్, ఆర్జే వీర రాఘవ, కో ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, షేక్ రఫీ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

క్విజ్ పోటీలో ఐఎఫ్ఎస్సి స్కూల్ ఫస్ట్

ప్రజాశక్తి-కాకినాడ

జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ధీరుభాయ్ అంబానీ క్విజ్-2023 పోటీల్లో 225 పాఠశాలలు పాల్గొనగా కాకినాడ శ్రీనగర్‌కు చెందిన అద్విష్ ఫౌండేషన్ నగరపాలక పాఠశాల విద్యార్థులు మహమ్మద్ జైనుల్ అబిదీన్, సమ్మరీన్ ఫాతిమా టీమ్ ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. విద్యార్థులకు రిలయన్స్ ధీరుభాయ్ అంబానీ క్విజ్ నిర్వాహకులు లాప్‌టాప్‌లు, నగదు బహుమతి అందించారు. విద్యార్థులను సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుని పి.సూర్యకుమారి, హెచ్ఎం, ఉపాధ్యాయ సిబ్బంది కృషి ఫలితంగానే జిల్లాలో ప్రథమ స్థానం సాధించారని ప్రిన్సిపల్ సూరకాంత అభినందించారు.

బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతిజ్ఞ

ప్రజాశక్తి-గండేపల్లి

మండలంలోని మల్లేపల్లి హైస్కూల్ ఆవరణలో హెచ్ఎం జి.సుధా మాధురి అధ్యక్షతన బాల్యవివాహాల నిర్మూలనపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సుధా మాధురి మాట్లాడుతూ జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ కార్యక్రమం డిసెంబర్ 25 వరకు జరుగుతుందని అన్నారు. బాల్యవివాహాలు జరగడం ద్వారా ఆరోగ్యహాని ఏర్పడి అనేక అనర్థాలకు దారి తీస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విఇఒలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - గోకవరం

రైతు నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలం అయిందని టిడిపి మండల రైతు విభాగం అధ్యక్షుడు చింతల రామకృష్ణ విమర్శించారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ తుపాను కారణంగా రైతులు కష్టాల్లో మునిగిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ప్రకటించినా నేటికీ ఆ ధాన్యం కొనుగోలును ప్రారంభించలేదన్నారు. కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకోవటం మానేసి మాటల గారడి చేస్తుందని అన్నారు. రైతులు కష్టాల్లో ఉంటే అధికార యంత్రాంగం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందన్నారు. త్వరితగతిన పంట నష్టం అంచనా వేసి రైతులకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు.

బాధితునికి రూ.25 వేల సాయం

ప్రజాశక్తి - యానాం

అనారోగ్యంతో బాధ పడుతున్న స్థానిక కామిశెట్టివారి వీధికి చెందిన అద్దేపల్లి సత్యనారాయణకు సహాయ ఫ్రాన్స్ క్లబ్ సభ్యులు రూ.25 వేలు సమకూర్చి తమ ప్రతినిధి కిషోర్ ద్వారా అందజేశారు. కొల్లాటి సరళ, క్రాంతి, మద్దింశెట్టి జయ, శాంతి, జ్యోత్స్న, జీవాణి, హజిరాఖాన్, లత గల్ల, రాధ జిన్నూవురు, సుష్మా తదితరులు ఈ మొత్తాన్ని సమకూర్చారు. యానాం నుంచి ఫ్రాన్స్ వెళ్లి ఇక్కడి వారికి కష్టమొస్తే సాయం చేస్తున్న క్లబ్ సభ్యులను స్థానికులు అభినందించారు.

380 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

శుక్రవారం సామర్లకోట మండలం సామర్లకోట, భీమవరం, జగ్గమ్మగారిపేట పొలాలకు వెళ్ళి రైతుల నుండి 380 టన్నుల మెట్రిక్ టన్నుల ధాన్యంను కొనుగోలు చేసినట్లు మండల వ్యవసాయాధికారి ఇమ్మిడిశెట్టి సత్య చెప్పారు. ప్రభుత్వ నిభందనల మేరకు త్వరలో ఎన్యూమరేషన్ ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. ఎఒ వెంట రైతులు, ఎఇఒ వెంకట సతీష్ తదితరులున్నారు.

పెదకూరపాడు ఎంఎల్ఎ పూజలు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట కుమారారామ భీమేశ్వరాలయంలో పల్నాడు జిల్లా పెదకూరపాడు ఎంఎల్ఎ నంబూరు శంకరరావు, వసంత కుమారి దంపతులు శుక్రవారం లక్షపత్రి పూజలు చేపట్టారు. కార్తీక మాస పూజల్లో బాగంగా వారు ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయంలోనే గడిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయానికి వచ్చిన ఎంఎల్ఎ దంపతులకు ఆలయ ఇఒ టి.వెంకట సూర్యనారాయణ స్వాగతం పలికారు.

9,10న సింహాద్రి ఎక్స్‌ప్రెస్ పునరుద్ధణ

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

రైల్వే అధికారులు ఈ నెల 17వ తేదీ వరకూ రద్దు చేసిన గుంటూరు-విశాఖపట్నం సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రైలును ఈ నెల 9, 10 తేదీల్లో యథాప్రకారం తిరుగుతుందని రైల్వే ఉన్నతాధికారులు ప్రకటించారు. విశాఖపట్నం-గుంటూరు ఈ నెల 10,11 తేదీల్లో యథాప్రకారం తిరుగుతుందన్నారు. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే ఎటిం అధికారి ఎ.సురేష్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే రోజుల తరబడి ఈ రైలును రద్దు చేయడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ఈ విషయాన్ని సామర్లకోట రైల్వే మేనేజర్ రమేష్ ధ్రువీకరించారు.



ఎంఎల్ఎ శంకర్రావు దంపతులను సత్కరిస్తున్న దొరబాబు


ఎంఎల్ఎ దంపతులకు ఘన సత్కారం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

భీమేశ్వరాలయంలో లక్షపత్రి పూజలు చేయించుకున్న పెదకూరపాడు ఎంఎల్ఎ నంబూరు శంకరరావు దంపతులను శుక్రవారం రాష్ట్ర హౌసింగు కార్పోరేషన్ చైర్మన్, దవులూరి దొరబాబు, ఆయన తండ్రి దవులూరి సుబ్బారావు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, వైసిపి కౌన్సిలర్ నేతల హరిబాబు, మాజీ కౌన్సిలర్ దూది రాజుబాబు తదితరులున్నారు.

స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి - కడియం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ గోరంట్ల

గ్రామ స్వపరిపాలనకు కావలసిన నిధులు ఇవ్వకుండా స్థానిక సంస్థలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి ధ్వజమెత్తారు. శుక్రవారం కడియంలో ఎంపిపి వెలుగుబట్టి ప్రసాద్ ఆధ్వర్యంలో మాజీ జడ్‌పిటిసిలు, మాజీ ఎంపిపిలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపిటిసి సభ్యులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో గోరంట్ల మాట్లాడుతూ గ్రామ సచివాలయాల నిర్వహణ పట్ల ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంభిస్తోందన్నారు. గ్రామ పంచాయతీలకు సచివాలయాలతో ఏమాత్రం సంబంధం లేదని, ప్రజలతో ఎన్నుకోబడిన సర్పంచ్‌లను సిఎం జగన్ రెడ్డి ఉత్సవ విగ్రహాలుగా చేశారని విమర్శించారు. పంచాయి తీలకు వచ్చే కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే వేలాది కోట్ల రూపాయలను పక్కదారి పెట్టించారని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మోసం వల్ల పంచాయితీ వ్యవస్థ నిర్వీర్యం అయ్యే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. సర్పంచ్, వార్డుసభ్యులకు తెలియకుండా, పంచాయతీ బోర్డు తీర్మానం లేకుండా పంచాయతీ ఖాతాల నుంచి నిధులు మళ్లించడం ద్వారా స్థానికసంస్థల ప్రతినిధులను ప్రభుత్వం మోసం చేయడమేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం వాటా చెల్లించకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు దోహదం చేసే జల జీవన్ మిషన్ పథకం నిలిచిపోయిందని తెలిపారు. ఈ ఐదేళ్ల జగన్ రెడ్డి పాలనలో గ్రామాల్లో రోడ్డు కాని, కాలువలు కానీ నూతనంగా వేసిన పరిస్థితి లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో డ్రైనేజీ, తాగునీటి వ్యవస్థ అధ్వానంగా మారిపో యిందని అన్నారు. ఆఖరికి పంచాయతీలో బ్లీచింగ్ వేయ డానికి కూడా డబ్బులు లేని స్థితిలో పంచాయతీ వ్యవస్థను దిగజార్చిసేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరిగి టిడిపి ప్రభుత్వం ఏర్పాటుతోనే పంచాయితీలకు పూర్వవైభవం వస్తుందని అన్నారు. పంచాయితీలకు నిధులతోపాటు, విధులను సక్రమంగా నిర్వర్తించే అవకాశం టిడిపి పాలన లోనే సాధ్యమని, ఇప్పటినుంచే గ్రామాల అభివృద్ధిపై టిడిపి ప్రణాళికను సిద్ధం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు వెలుగుబంటి రఘురామ్, రూరల్ మండలం టిడిపి అధ్యక్షులు మచ్చేటి ప్రసాద్, నాయకులు ఎం.సత్యనారాయణ, పి.రామారావు చౌదరి, ఎం.సత్యవతి, జి.సత్యనారాయణ, వి.నాగబాబు, కృపారావు పాల్గొన్నారు.

పంట నష్టపోయాం ఆదుకోండి

ప్రజాశక్తి - ఉంగ్రాజవరం



పంట నష్టాన్ని పరిశీలిస్తున్న సచివాలయ సిబ్బంది

తుపాను ప్రభావంతో పంటను నష్టపోయామని, ప్రభుత్వం తక్షణమే తమను ఆదుకోవాలని ఉంగ్రాజవరం, తాడిపర్రు గ్రామాల రైతులు గోపా గోపాలం, చిన్న రాజా, వెంకట్రావు, శ్రీనివాసు, కరుటూరి వెంకట సూర్యనారాయణ, కరుటూరి వెంకట చౌదరి, బందుల విశ్వేశ్వరరావు, అక్కాబత్తుల సత్యనారాయణ, అరిగెల సుబ్రమణ్యం కోరారు. పంట నష్టంను అంచనా వేసేందుకు వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు శుక్రవారం ఆయా గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా రైతులు తమకు జరిగిన నష్టంపై అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా ఉద్యానవన, వ్యవసాయ శాఖ అధికారులు సిహెచ్.శ్రీనివాస్, ఎం.విశ్వాసరావు మాట్లాడుతూ తుపాను కారణంగా నాలుగు రోజులపాటు కురిసిన వర్షాలతో సుమారు 300 ఎకరాల్లో వరి, 20 హెక్టార్లలతో అరటి, కూరగాయల పంట దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు తెలిపారు. ప్రస్తుతం వరిచేల నుంచి వర్షపునీరు బయటకు వెళ్లిపోయినప్పటికీ, చేనులోకి కోత యంత్రం వెళ్లే అవకాశం లేదని, పంట కోతకు ఇంకా కనీసం 10 నుంచి 15 రోజులు సమయం పడుతుందని తెలిపారు. మండలంలోని కె.సావరం, మోర్త గ్రామాల్లో అధిక శాతం అరటి తోటలు, దమ్మెన్ను, వేలివెన్ను గ్రామాల్లో కూరగాయల పంట నష్టం కలిగినట్లు చెప్పారు. ఈ పర్యటనలో ఎంపిఇఒ ఇంజేటి నాగమణి, సిద్ధాని జగదీశ్వరి ఉంగ్రాజవరంలో వరి పంట నష్టాన్ని పరిశీలించారు.



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న విసి పద్మరాజు

నేటి నుంచి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

ప్రజాశక్తి - రాజానగరం

ఆదికవి నన్నయ యూనివర్సిటీలో నేటి నుంచి సౌత్ అండ్ వెస్ట్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ మెన్ అండ్ ఉమెన్ ఛాంపియన్ షిప్ 2023 -24 నిర్వహిస్తున్నామని విసి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. శుక్రవారం యూనివర్సిటీలో వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్‌కు సంబంధించిన ఏర్పాట్లును ఆయన పరిశీలించారు. ప్రత్యేక శ్రద్ధతో అన్ని కమిటీల కోఆర్డినేటర్లు, టెక్నికల్ అఫీషియల్స్, టీమ్ మేనేజర్స్ అండ్ కోచ్‌లకు తగిన సూచనలను చేశారు. సమష్టిగా కృషి చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పాండిచ్చేరి, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, గుజరాత్, గోవా రాష్ట్రాల్లోని సుమారు 90 యూనివర్శిటీల నుంచి క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు.. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఔనత్యాన్ని పెంచే విధంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

ముంపు ప్రాంతాల్లో ఎంఎల్ఎ పర్యటన

ప్రజాశక్తి - సీతానగరం

తుపాను ప్రభావిత ముంపు ప్రాంతాల్లో ఎంఎల్ఎ జక్కంపూడి రాజా శుక్రవారం పర్యటించారు. మండలంలో కాటవరం, ముగ్గుళ్ళ, రఘుదేవపురం, రాపాక, ఇనగంటివారిపేట, చినకొండేపూడి, కూనవరం తదితర ప్రాంతాల్లోనూ, కోరుకొండ మండలంలో కోటి కేశవరం, శ్రీరంగపట్నం, మునగాల గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలకు తుపాను ప్రభావంతో తీవ్ర నష్టం వాటిలిందన్నారు. నష్టపోయిన రైతులకు మానవత్వంతో వ్యవహరించాలని సిఎం ఆదేశించారని తెలిపారు. రంగు మారిన, తడిసిన, తేమ శాతం ఎక్కువగా ఉన్నా ధాన్యాన్ని ఆఫ్‌లైన్‌లో సేకరించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు.



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న బాబూరావు

బాధితులకు నిత్యవసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి - తాళ్లపూడి

పునరావస కేంద్రాల్లో ఉన్న తుపాను బాధితులకు నిత్యవసర సరుకులను పంపిణీ చే శారు. తుపాన్ కారణం గా ప్రక్కిలంక, పైడిమెట్ట గ్రామాల్లో ఏర్పాటుచేసిన పునరావాస శిబిరాల్లో తలదాచుకుంటున్న 28 కుటుంబాలకు ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, సర్పంచ్ స్వప్న ఆదేశాలతో ఒక్కొక్క కుటుంబానికి 25 కేజీల బియ్యం, ఇతర నిత్యవసర సరుకులు, కూరగాయలను కొవ్వూరు నియోజకవర్గ వైసిపి ఎస్‌సి విభాగం అధ్యక్షులు యాళ్ల బాబురావు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకుడు కొల్లి.దుర్గారావు, విఆర్ఒ విజయ కుమారి, వాలంటీర్లు రాధిక, నక్షత, సౌందర్య తదితరులు పాల్గొన్నారు.

104, 108 అంబులెన్స్ సేవలపై అవగాహన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని చినకొండేపూడిలో 104, 108 అంబులెన్స్ అందుస్తున్న సేవలపై అవగాహన కార్యక్ర మాన్ని శుక్రవారం నిర్వహిం చారు. ఇఎంటి టి.సునీత, పైలట్ మణికుమార్ 108 సేవల సేవల యొక్క ఉప యోగాలను ప్రజలకు వివరిం చారు. 108 సేవలను ఏవిధంగా అందిపుచ్చుకోవాలనే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే వైద్య శిబిరంలో రోగులకు వైద్య సేవలు అందించారు.

సమగ్ర కుల గణన సక్రమంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - గోకవరం



సమావేశంలో మాట్లాడుతున్న వీరబాబు

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కులగణన సక్రమంగా జరిపి నమోదు చేయాలని గోకవరం మండల ఎంపిడిఒ కె.పద్మజ్యోతి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాల యంలో కుల గణనపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమా వేశంలో వైసిపి నాయకులు సుంకర వీరబాబు మాట్లా డుతూ సమగ్ర కుల గణనతో సామాజికంగా, ఆర్థికంగా, వెనుకబడిన వర్గాలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కులగణనతో జనాభాలో అత్యధిక శాతం ఉన్న బిసి సామాజిక వర్గాలతోపాటు ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ వర్గాలకు న్యాయం జరుగుతుందని వివరించారు. కులగణన నమోదులో ఎటువంటి అవకతవకలు లేకుండా నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ ఎ.శ్రీనివాస్, ఇఒపిఆర్‌డి ఎం.రాజేశ్వరరావు, ఎంఇఒలు బి.గౌరమ్మ, చిమ్మరాజు దొర పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - చాగల్లు

తుపాన్ వల్ల నష్టపోయిన రైతంగానే ప్రభు త్వం వెంటనే ఆదుకో వాలని తూర్పుగోదావరి జిల్లా రైతు సంఘం కన్వీనర్ గారపాటి వెంకటసుబ్బారావు శుక్రవా రం ఓ ప్రకటనలో కోరారు. కొవ్వాడ కాలవలో గుర్రపు డెక్క తొలగించక పోవడంతో వంతెన వద్ద అడ్డుపడి పల్లపు ప్రాంతాల్లోని పొలాలు మునిగి రైతులు నష్టపోతున్నారని అన్నారు. డిస్కలరీ పొంత రోడ్డు (లంక పొలం) కాలువపై ఉన్న వంతెన ఇరుకుగా ఉండడంతో గుర్రపు డెక్క అడ్డుపడి రైతుల పంటను పాడుచేస్తుందని అన్నారు. తక్షణమే కొత్త వంతెన నిర్మాణం చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. రబీ సాగుకు సిద్ధమైన రైతులు ఆకు కోసం విత్తనాలు వేశారని, తుపాను వల్ల ఆకు మొత్తం నాశనం అయ్యిందని, తక్షణమే ప్రభుత్వం రైతులకు విత్తనాలను ఉచితంగా సరఫరా చేయాలని ఆయన కోరారు.

నేడు ఎస్‌సి, ఎస్‌టి మైనార్టీల వన సమ్మేళనం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రతి ఏడాది మాదిరిగానే ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో శనివారం నిర్వహిస్తున్న మన చైతన్య వన సమ్మేళనం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వేదిక చైర్మన్ గుబ్బల రాంబాబు, కన్వీనర్ అజ్జరపు వాసు పిలుపునిచ్చారు. జాతీయ రహదారిలోని బెస్ట్ ప్రైస్ పక్కన గల చెరుకూరి గార్డెన్స్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి మన చైతన్య వన సమ్మేళనం కార్యక్రమం ప్రారంభం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి కమిషన్ చైర్మన్ ఎం విక్టర్ ప్రసాద్, తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ జి జానకి షర్మిల, తూర్పు గోదావరి జిల్లా అడిషనల్ ఎస్‌పి పి సోమశేఖర్, జిఎస్‌టి అసిస్టెంట్ కమిషనర్ శ్రీకృష్ణ, ఎల్ఐసి సీనియర్ డివిజనల్ మేనేజర్ బి.ప్రసాద్ రావు, ఎపి ఇపిడిసిఎల్ జనరల్ మేనేజర్(విశాఖ) తిలక్ కుమార్, ఎపి ఇపిడిసిఎల్ తూర్పు గోదావరి జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నక్కపల్లి సామ్యూల్, డిప్యూటీ చీఫ్ కంట్రోల్ ఆఫ్ అకౌంట్స్ విడి.సర్వేశ్వరరావు, ఎపి స్టేట్ హజ్ కమిటీ చైర్మన్ బిఎస్.గౌస్ లజామ్, ప్రజా గాయకుడు, దక్షిణ భారతదేశ సమత సైనిక్ ఉపాధ్యక్షులు షాన్ రేంజర్ల రాజేష్ పాల్గొంటున్నారని తెలిపారు. అంబేద్కర్ ఆలోచన విధానంతో దళిత గిరిజన మైనార్టీలను ఐక్యం చేసే లక్ష్యంతో గత ఏడేళ్లుగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో రాజకీయాలకు అతీతంగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కొంతమూరు షానా, యాదల సతీష్ చంద్ర స్టాలిన్, బోర్రా చిన్ని, కప్పల వెలుగు కుమారి పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.